సమగ్ర ఇంటింటి సర్వేను పక్కాగా నిర్వహించాలి

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, అక్టోబర్ 29 : సమగ్ర ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను ఇంటింటికీ తిరిగి చేపట్టాలన్నారు. ఏ ఒక్క ఇల్లు కూడా తప్పిపోకుండా సర్వే చేయాలని సూచించారు. సర్వే కోసం ఎన్యుమారేటర్లను నియమించాలని, వారికి శిక్షణ ఇవ్వాలని చెప్పారు. ఎన్యుమరేటర్లకు అపాయింమెంట్ ఉత్తర్వులు జారీ చేయాలని సూచించారు. మండల ప్రత్యేకాధికారులు ఎన్యుమరేటర్లపై పర్యవేక్షణ ఉండాలని అన్నారు. మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎలాంటి సమస్యలూ తలెత్తకుండా సర్వేను పకడ్బందీగా, పక్కాగా నిర్వహించాలని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సీపీవో రాజారాం, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

ముసాయిదా ఓటరు జాబితా ప్రకటన..
స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025కు సంబంధించిన ముసాయిదా ఓటరు జాబితాను మంగళవారం ప్రకటించినట్లు కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ తెలిపారు. మినీ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ఎస్ఆర్ ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించినట్లు తెలిపారు. ఈ జాబితాలో అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉంటే సమర్పించవచ్చని, వాటిని పరిశీలించి సంబంధిత అధికారులు సరి చేస్తారని అన్నారు. నవంబర్ 9, 10వ తేదీల్లో ప్రత్యేక క్యాంపెయిన్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వాటిలో వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి డిసెంబర్ 24వ తేదీలోగా డిస్పోజల్ చేస్తారన్నారు. 2025 జనవరి 6వ తేదీన ఫైనల్ పబ్లికేషన్ ప్రకటిస్తారన్నారు. జనవరి 1, 2025 నాటికి 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, ఆర్డీవో రంగనాథ్ రావు, తహసీల్దార్ జనార్దన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సర్వేను విజయవంతం చేయాలి

కామారెడ్డి, అక్టోబర్ 29 : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను విజయవంతం చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం ఆయా జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణకు తయారు చేసిన ప్రణాళిక సర్వే నిర్వహణ విధి విధానాలను క్యాబినెట్ సమావేశంలో చర్చించి ఆమోదించామని తెలిపారు. ఈ సర్వేలో ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య ఉపాధి రాజకీయ, కుల వివరాలను సేకరిస్తామని అన్నారు. 150 కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్ ఉండేలా ఈబీ మ్యాప్‌లను అప్‌డేట్ చేయాలని చెప్పారు. ఎన్యుమరేటర్‌కు నిర్దిష్టమైన ఎన్యుమరేషన్ బ్లాక్ కేటాయించాలని, 10 ఈబీ బ్లాక్‌లకు డేటా సేకరణ పర్యవేక్షణకు సూపర్‌వైజర్ ఉండాలని సూచించారు. సూపర్ వైజర్ 10 శాతం ఇండ్లను ర్యాండంగా ఎంచుకొని డేటా వివరాలు తనిఖీ చేయాలని తెలిపారు. నవంబర్ 6 నుంచి సర్వే ప్రారంభించాలని అధికారులకు సూచించారు. కరీంనగర్ నుంచి పాల్గొన్న రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ ఆశీష సంగ్వాన్

కామారెడ్డి, అక్టోబర్ 29 : ప్రభుత్వం కల్పిస్తున్న వసతి సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని మంచి విద్యను అభ్యసించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తా సమీపంలో ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహాన్ని మంగళవారం రాత్రి సందర్శించారు. కాసేపు విద్యార్థులతో ముచ్చటించి, వసతి గృహంలో విద్యార్థులో కలిసి భోజనం చేశారు. సౌకర్యాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగనాథ్‌రావు, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారిణి రజిత, సహాయ సంక్షేమ అధికారి వెంకటేశ్, హాస్టల్ వెల్ఫేర్ అధికారి యాదగిరి, తహసీల్దార్ జనార్దన్ పాల్గొన్నారు.

జిల్లా అదనపు కలెక్టర్‌గా విక్టర్

బాధ్యతలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ విక్టర్

కామారెడ్డి, అక్టోబర్ 29 : కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌గా (రెవెన్యూ) విక్టర్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ (స్థానిక సం స్థల) శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత

కామారెడ్డి, అక్టోబర్ 29 : జిల్లా కేంద్రంలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న ఐదుగురు బాధితులకు మంగళవారం పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా ఈ ఫోన్‌ను ట్రేస్ చేసి బాధితులకు అప్పగించినట్లు తెలిపారు.

దవాఖానను సందర్శించిన పోచారం

పనులను పరిశీలిస్తున్న వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ, అక్టోబర్ 29 : బాన్సువాడలోని వంద పడకల మాతాశిశు దవాఖానను రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా దవాఖానలో రోగులతో మాట్లాడారు. వైద్యుల పనితీరుపై ఆరాతీశారు. రోగులకు సౌకర్యార్థం దవాఖాన వెనుక భాగంలో నిర్మిస్తున్న తాత్కాలిక షెడ్డును పరిశీలించారు. పనులను నాణ్యతతో చేపట్టాలని చెప్పారు. ఆయన వెంట వ్యక్తిగత సహాయకుడు భగవాన్‌రెడ్డి, బోడ భాస్కర్, ఖాలేఖ్ తదితరులు ఉన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ

నస్రుల్లాబాద్, అక్టోబర్ 29 : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలోని దివ్యాంగ విద్యార్థులకు భవిత సెంటర్‌లో మంగళవారం ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మనీషా మాట్లాడుతూ.. పాఠశాలలోని మొత్తం తొమ్మిది మంది దివ్యాంగ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించామన్నారు. ఇంటి దగ్గర చేయాల్సిన వ్యాయామాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు సలహాలు సూచనలు చేశామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హన్మాండ్లు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి, అక్టోబర్ 29 : జిల్లా కేంద్రంలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న సమన్విత, కౌసల్య దవాఖానలను సీజ్ చేసి చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో ఈ దవాఖానలపై చర్యలు తీసుకొని మళ్లీ దవాఖానను నడపడానికి అనుమతి ఇవ్వడంతో చట్టంపై విలువ లేకుండా పోయిందని అన్నారు. అన్ని ప్రైవేట్ దవాఖానల్లో ఒకసారి దాడులు చేసి, యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు వేయాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, వెంకట్‌గౌడ్, మోతిరాం నాయక్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఫణిహారం రంగాచారికి నివాళి

కామారెడ్డి, అక్టోబర్ 29 : జిల్లా కేంద్రంలోని మున్సిపల్ ఆవరణలో ఫణిహారం రంగాచారి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకుడు నర్సింహారెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వేణుగోపాల్, సీపీఐ జిల్లా కార్యదర్శి దశరథ్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి

కామారెడ్డి, అక్టోబర్ 29 : జిల్లా కేంద్రంలోని పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధన్వంతరి జయంతిని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పులగం మోహన్, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ బాలకిషన్ గౌడ్, జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, కోశాధికారి నర్సింహులు, ఉపాధ్యక్షుడు విఠల్ శివారెడ్డి, చారి, శివ, దయాల్, సంజీవరెడ్డి, చంద్రశేఖర్, గోపీ, శ్రీనివాస్, ఓం ప్రకాశ్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఉపాధ్యాయులు

నస్రుల్లాబాద్, అక్టోబర్ 29 : మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో అమ్మ పేరు మీద ఒక మొక్క నాటుదాం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మై భారత్ పోర్టల్ ప్రారంభించి సంవత్సరం కావస్తున్న సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల ఆవరణలో 50 మొక్కలు నాటారు. నెహ్రూ యువ కేంద్రం మాజీ వలంటీర్ సునీల్ రాథోడ్, పాఠశాల ప్రిన్సిపాల్ మాధవరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరణ

మాచారెడ్డి, అక్టోబర్ 29 : యువకుడిని దారుణంగా హత్య చేసి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లుగా చిత్రీకరించిన ఘటన పాల్వంచ మండలం ఇసాయిపేట శివారులోని అటవీ ప్రాంతం లో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకున్నది. ఎస్సై అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి మండలంలోని ఉగ్రవాయి గ్రామానికి చెందిన దువ్వాల కృష్ణ(32) తన కుటుంబ సభ్యులతో కలిసి మాచారెడ్డిలో నివసిస్తున్నాడు. ఓ పాల డెయిరీలో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఆటో తీసుకొని మాచారెడ్డి, అక్కాపూర్ గ్రామాలకు పాలు తీసుకెళ్లాడు. ఇసాయిపేటకు సమయానికి ఆటో రాకపోవడంతో పాలకేంద్రం నిర్వాహకులకు పాడి రైతులు ఫోన్ చేశారు. ఆటోలో ఏదైనా సమస్య రావచ్చు వెళ్లి చూడాలని పాడి రైతులను కోరగా గ్రామశివారులోని కిష్టమ్మ వాగు వద్ద ఆటోను గుర్తించారు. కొంచెం దూరంలో కృష్ణ చెట్టుకు ఉరేసుకున్నట్లు గుర్తించారు. వెంటనే ఎస్సై ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలను సేకరించారు. మృతుడి తల్లి గంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం కామారెడ్డి ఏరియా వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

మాజీ ప్రభుత్వ విప్‌ను కలిసిన విండో చైర్మన్

మాజీ ప్రభుత్వ విప్‌ను కలిసిన బస్వాపూర్ విండో చైర్మన్ పాలకవర్గ సభ్యులు

భిక్కనూరు, అక్టోబర్ 29 : మండలంలోని బస్వాపూర్ సింగిల్ విండో నూతన ఇన్‌చార్జి చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన మద్ది స్వామి, పాలకవర్గ సభ్యులు మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారివెంట విండో డైరెక్టర్లు, సభ్యులు రాజారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాంరెడ్డి, కిష్టారెడ్డి, రాజనర్సింహారెడ్డి, నర్సింహులు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు

భిక్కనూరు, అక్టోబర్ 29 : మండలంలో వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ.. భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు మంగళవారం తహసీల్దార్ శివ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద కాంటాలను వెంటనే ప్రారంభించాలన్నారు. వడ్ల కుప్పలపై కప్పుకోవడానికి తాటిపత్రిలను సమకూర్చాలని అన్నారు. హమాలీ డబ్బులు ప్రభుత్వమే చెల్లించాలని చెప్పారు. వడ్లు కొన్న 48 గంటల్లో రైతులకు డబ్బులు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

రిజిస్ట్రార్‌గా డాక్టర్ శరత్ చంద్ర

కామారెడ్డి, అక్టోబర్ 29 : జిల్లా కేంద్రంలోని డెయిరీ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శరత్‌చంద్ర ఉద్యోగోన్నతిపై పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వ విద్యాలయం హైదరాబాద్ రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. సీనియర్ అధ్యాపకుడు ఉమాపతిని అసోసియేట్ డీన్‌గా నియమించారు.

పెద్దకొడప్‌గల్‌లో నేత్ర వైద్య శిబిరం

పెద్ద కొడప్‌గల్, అక్టోబర్ 29 : మండల కేంద్రంలోని కాటేపల్లి గ్రామంలో మంగళవారం బాన్సువాడ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో 25 మందికి పరీక్షలు నిర్వహించగా అందులో 20 మందికి మోతిబిందు ఉందని నిర్ధారించి వారిని చికిత్స నిమిత్తం బాన్సువాడ లయన్స్ క్లబ్ కంటి దవాఖానకు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ భరత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో విద్యార్థులకు వైద్యపరీక్షలు

రామారెడ్డి, అక్టోబర్ 29 : మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు స్థానిక మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేశ్ వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి సంబంధిత మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, తదితర వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట హెచ్ఈ జార్జ్‌సురేందర్, సూపర్ వైజర్ జానకమ్మ, ఆరోగ్య సిబ్బంది రజిత, ఆశ వర్కర్లు ప్రమీల, వనిత ఉన్నారు.

డిగ్రీ కళాశాలలో దంత వైద్యశిబిరం

బిచ్కుంద, అక్టోబర్ 29 : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 విభాగాల ఆధ్వర్యంలో దంత వైద్యుడు డాక్టర్ శ్రీధర్ రెడ్డి ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు దంత పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.అశోక్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ జి. వెంకటేశం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వై. సంజీవరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

'ఏఈవోలను విధుల్లోకి తీసుకోవాలి'

పెద్ద కొడప్‌గల్, అక్టోబర్ 29 : రాష్ట్ర వ్యాప్తంగా సస్పెండ్ అయిన ఏఈవోలను విధుల్లోకి తీసుకోవాలని ఏఈవోలు డిమాండ్ చేశారు. పిట్లం మండలంలోని తిమ్మానగర్ రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమంలో నల్ల బాడ్జీలతో ఏఈవోలు మంగళవారం నిరసన తెలిపారు. ఏఈవోలు లావణ్య, సురేశ్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

పెద్ద కొడప్‌గల్, అక్టోబర్ 29 : మండలంలోని వడ్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అర్చన, కీర్తన జిల్లా స్థాయి షాట్‌పుట్, హైజంప్, లాంగ్‌జంప్ పోటీలో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ ధర్మేందర్ తెలిపారు. మంగళవారం కామారెడ్డిలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలో పాఠశాలకు చెందిన విద్యార్థులు అర్చన 8వ తరగతి షాట్‌పుట్‌లో ప్రథమ స్థానం, కీర్తన 10వ తరగతి హైజంప్‌లో ప్రథమ, లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానం సాధించినట్లు చెప్పారు. విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించింది.

కబడ్డీ పోటీలకు..
రామారెడ్డి, అక్టోబర్ 29 : 68వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మండలంలోని పోసానిపేట ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి సుశ్వంత్ రెడ్డి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఆయన భువనగిరి జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని పీఈటీ నరేశ్‌రెడ్డి తెలిపారు. విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయబృందం అభినందించింది.

అంగన్‌వాడీ ఆయాలకు సన్మానం

పెద్ద కొడప్‌గల్, అక్టోబర్ 29: పిట్లంలో ఉద్యోగ విరమణ పొందిన ముగ్గురు అంగన్‌వాడీ ఆయాలకు మంగళవారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేణుక, సిబ్బంది శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా రేణుక మాట్లాడుతూ..అన్నారం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో పని చేసిన శాంతమ్మ, పిట్లం అంగన్‌వాడీ 1,2 కేంద్రాల్లో పని చేసిన ఇద్దరు సాయమ్మలు ఎంతో అంకిత భావంతో సేవలు అందించారని వారి సేవలను కొనియాడారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

బిచ్కుంద, అక్టోబర్ 29 : విద్యార్థులు కష్టపడి చదివి అనుకున్న లక్ష్యం కోసం ముందుకు సాగాలని జిల్లా నోడల్ ఆఫీసర్ షేక్ సలాం అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం సందర్శించి స్టడీ అవర్స్ వివరాలను ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

పాఠశాలకు మైక్ సెట్ వితరణ

రామారెడ్డి, అక్టోబర్ 29 : మండలంలోని రెడ్డిపేట్ స్కూల్ తండా గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సక్రుసంత్యాలి దంపతులు ఆంప్లిఫైర్ మైక్‌సెట్‌ను డొనేట్ చేశారు. ఈ సందర్భంగా సక్రుసంత్యాలి దంపతులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్‌రావు శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

గొల్లపల్లిలో పశువైద్య శిబిరం

రామారెడ్డి అక్టోబర్ 29 : మండలంలోని గొల్లపల్లి గ్రామంలో మంగళవారం పశుసంవర్ధకశాఖ, సదాశివనగర్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. మండల పశువైద్యాధికారి రాము పశువులకు చూడి పరీక్షలు నిర్వహించారు. సదాశివనగర్ మండల మార్కెట్ కమిటీ చైర్మన్ సంఘ్యానాయక్,వైస్ చెర్మన్ రాజిరెడ్డి, డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

వడ్ల కొనుగోలు ప్రారంభించండి సారూ..

రామారెడ్డి అక్టోబర్ 29 : సదాశివనగర్ మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద వడ్లను తూకం వేసి కొనుగోళ్లు ప్రారంభించాలని సదాశివనగర్ మండల జడ్పీటీసీ మాజీ సభ్యుడు పడిగెల రాజేశ్వర్ రావు, రైతులతో కలిసి మంగళవారం తహసీల్దార్ గంగాసాగర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఎంతో ఆర్భాటంగా జిల్లా మొత్తం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన నాయకులు, అధికారులు ఇప్పుడు పత్తాలేకుండా పోయారని పేర్కొన్నారు. వడ్ల కొనుగోలు తక్షణమే ప్రారంభించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఆయనవెంట బీఆర్ఎస్ మండల మాజీ కార్యదర్శి నర్సారెడి, పద్మాజీవాడ మాజీ ఉప సర్పంచ్ ఎల్లాగౌడ్, ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు లచ్చిరాంనాయక్, రైతులు ఉన్నారు.

బీడీ కార్మికులకు జీవనభృతి అందజేయాలి


తహసీల్దార్ సతీశ్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేస్తున్న సీపీఐఎంల్ నాయకులు

గాంధారి, అక్టోబర్ 29: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం బీడీకార్మికులకు రూ.4016 జీవనభృతిని వెంటనే అందజేయాలని సీపీఐఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా కార్మిక సంఘం ఆధ్వర్యంలో బీడీ కార్మికులతో కలిసి తహసీల్ కార్యాలయ సమీపంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి తహసీల్దార్ సతీశ్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీడీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన

నిజాంసాగర్, అక్టోబర్ 29 : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయ వసతి గృహంలో నిర్వహిస్తున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను అధికారులు, నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ ఆంజనేయులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏలె మల్లికార్జున్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేయండి .. ప్రాణదాతలుగా మారండి

ఎల్లారెడ్డిలో రక్తదానం చేసిన వారికి ధ్రువపత్రాలు అందజేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 29: రక్తదానం చేసి ప్రాణదాతలుగా మారాలని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం ఎల్లారెడ్డి పట్టణంలోని ముత్యపు రాఘవులు ఫంక్షన్ హాల్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీసుశాఖ, రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో 52 మంది దాతల నుంచి రక్తాన్ని సేకరించిన నిర్వాహకులు వారికి పండ్లు, ఫ్రూట్ జ్యూస్ అందించగా, డీఎస్పీ శ్రీనివాసులు ధ్రువపత్రాలను అందజేశారు. ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై బొజ్జ మహేశ్, సదాశివనగర్ సీఐ సంతోష్‌కుమార్ రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, రెడ్‌క్రాస్ స్టేట్ బోర్డు మెంబర్ సంజీవ్‌రెడ్డి, పోలీసులు సిద్ధు, హోంగార్డు వీరప్రసాద్, లింగంపేట్ మండల రెడ్‌క్రాస్ అధ్యక్షుడు బొల్లు శ్రీకాంత్, తదితరులున్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడి మృతి

లింగంపేట, అక్టోబర్ 29: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎంఈవో షౌఖత్ అలీ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం.. నాగిరెడ్డిపేట మండలంలోని మాటూర్‌మాసన్‌పల్లి గ్రామానికి చెందిన యాదగిరి(32) నాలుగు నెలల క్రితం ప్రభుత్వం ప్రకటించిన గురుకుల పాఠశాల ఫలితాల్లో ఉద్యోగం సాధించి లింగంపేటలోని మహాత్మజ్యోతిబా పూలే పాఠశాలలో విధుల్లో చేరారు. రెండు నెలల పాటు విధులు నిర్వహించి డీఎస్సీ ఫలితాల్లో జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. యాదగిరి గురుకుల పాఠశాలను వదిలి లింగంపేట బాలుర ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మరుసటి రోజే సెలవు పెట్టి చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. మాటూర్ మాసన్‌పల్లి గ్రామంలో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. యాదగిరి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కలగానే మిగిలిన ప్రభుత్వ ఉద్యోగం..
ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరిన యాదగిరి ప్రభుత్వ ఉద్యోగం కలగానే మిగిలిపోయింది. మాటూర్ మాసన్‌పల్లి గ్రామానికి చెందిన వరిగే నర్సింలు, లక్ష్మిలకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. యాదగిరి తండ్రి బన్‌లు విక్రయిస్తూ ఆటో నడుపుతూ జీవనం కొనసాగించేవాడు. ఇద్దరు కూతుళ్లు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. కుటుంబ పరిస్థితులు అంతంత మాత్రంగా ఉండడంతో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే కలను నేరవేర్చుకున్న యాదగిరి విధుల్లో చేరిన అనతి కాలంలోనే మృత్యు ఒడికి చేరాడు. గురుకుల పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సమయంలో జరిగిన ప్రమాదంలో తలకు గాయం కావడంతో చికిత్సలు పొందుతున్నాడు. దవాఖానలో చికిత్స పొందు పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు.

ఒకరి ఆత్మహత్య..
ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 29: అనారోగ్యంతో బాధపడుతూ గడ్డిమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని అడ్విలింగాల్ గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేశ్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన పోలీస్ శ్రీనివాస్ (45) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నా డు. అక్టోబర్ 24న శ్రీనివాస్ భార్య పొలం పనులకు వెళ్లగా ఇంట్లో ఉన్న శ్రీనివాస్ గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అదే సమయంలో ఇంటికి వచ్చిన శ్రీనివాస్ భార్య పరిస్థితిని గమనించి అతన్ని వెంటనే ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించింది. డాక్టర్ సలహా మేరకు కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ శ్రీనివాస్ 28న రాత్రి 11గంటలకు మృతిచెందాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

యువత ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి


బిచ్కుంద ఐటీఐ కాలేజీలో అడ్వాన్స్ టెక్నాలజీ పరికరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

బిచ్కుంద, అక్టోబర్ 29 : యువత చదువుతోపాటు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐటీఐ కాలేజీని సందర్శించి కాలేజీలో ప్రవేశ పెట్టిన ఆరు కొత్త అడ్వాన్స్డ్ టెక్నాలజీ కోర్సుల్లో అడ్మిషన్లను కాలేజీ ప్రిన్సిపాల్ ప్రమోద్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాలేజీ ఆవరణ అంతా తిరిగి టాటా ఇండస్ట్రీస్ వారు పంపిన అడ్వాన్స్డ్ టెక్నాలజీ పరికరాలను, ప్రాంగణంలో నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేశ్, ఎస్సై మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల బోర్డుపై మారిన జిల్లా పేరు

రేపల్లెవాడ గ్రామ పాఠశాల బోర్డుపై కామారెడ్డిగా మారిన జిల్లా పేరు

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 29: నమస్తే తెలంగాణలో ప్రచురితమైన ''జిల్లా మారినా – పాఠశాల బోర్డుపై మారని పేరు'' అనే కథనంపై పాఠశాల ఉపాధ్యాయుడు స్పందించారు. బోర్డుపై నుంచి పాత జిల్లా పేరు నిజామాబాద్‌ను తొలగించి ''కామారెడ్డి'' అని రాయించాడు. ప్రత్యేక జిల్లాగా మారిన ఇన్ని సంవత్సరాలకు పాఠశాల బోర్డుపై కామారెడ్డి అని రాయించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఆలయ పరిసరాలను శుభ్రం చేయించిన మున్సిపల్ చైర్మన్

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 29: పట్టణంలోని అయ్యప్ప ఆలయ పరిసరాలను మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ మంగళవారం శుభ్రం చేయించారు. కార్తీకమాసం ప్రారంభం అవుతున్నందున ఆలయంలో సందడి ప్రారంభం కానుంది. అయ్యప్ప మాలధారణ చేసే దీక్షాధారులు, భక్తులతో ఉదయం నుంచే పూజలు ప్రారంభం కానుండడంతో పరిసరాలను శుభ్రం చేయించినట్లు ఆయన తెలిపారు. ఆయనతో పాటు కౌన్సిలరు జంగం నీలకంతం అప్ప, నాయకులు నునుగొండ శ్రీనివాస్, మంచిర్యాల విద్యాసాగర్, సంగని పోచయ్య, అల్లం శ్రీను తదితరులున్నారు.

పార్కును అందుబాటులోకి తీసుకురావాలి..
ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 29: పట్టణంలో ఏర్పాటు చేసిన పార్కు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ సూచించారు. మంగళవారం ఆయన పట్టణంలోని పార్కును ఏఈ వినోద్‌తో కలిసి పరిశీలించి అనంతరం మాట్లాడారు. ఆయనవెంట మాజీ వైస్ ఎంపీపీ నునుగొండ శ్రీనివాస్, నాయకులు నీలకంతం అప్ప, విద్యాసాగర్, తిరుపతి, అల్లం శ్రీను తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

మద్నూర్, అక్టోబర్ 29 : మండలకేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స చేసుకున్న పలువురికి మంజూరైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు హన్మండ్లుస్వామి, రాంపటేల్, అమూల్, రాజు, జావేద్‌పటేల్, బాలు తదితరులు ఉన్నారు.

పెద్ద కొడప్‌గల్‌లో..
పెద్ద కొడప్‌గల్, అక్టోబర్ 29 : మండలంలో అనారోగ్యంతో బాధపడుతూ వివిధ దవాఖానల్లో చికిత్స పొందిన పేదలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగిరెడ్డి, శామప్ప పటేల్, రాజ్‌దేశాయి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

పెద్ద కొడప్‌గల్, అక్టోబర్ 29: పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మండల ప్రత్యేకాధికారి కిషన్ పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరికి సూచించారు. మండలంలో పెద్ద దేవీసింగ్ తండా, సీతారాం తండాను మంగళవారం సందర్శించారు. పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన కార్యదర్శిని హెచ్చరించారు.

సాదాసీదాగా సాగిన సామాజిక తనిఖీ

లింగంపేట, అక్టోబర్ 29: మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనుల సామాజిక తనిఖీ గ్రామ సభ సాదా సీదాగా సాగింది. గత సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు మండలంలోని ఆయా పంచాయతీల్లో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందం అధికారులు విచారణ చేపట్టారు. విచారణ నివేదికను మంగళవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో వివరించారు. సామాజిక తనిఖీలో అడిషనల్ డీఆర్‌డీపీ వామన్‌రావు, సామాజిక తనిఖీ బృందం అధికారులు పాల్గొన్నారు.